
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
శుక్రవారం 3 మే 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	206	234
సూర్యాపేట	రూ.150	220	250
నల్లగొండ	రూ.149	216	246

ఉష్ణోగ్రత గరిష్ఠం 43.5 । కనిష్ఠం 25.2

ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్

శానసమండలి వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నికకు గురువారం నోటిఫికేషన్ జారీ అయింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టభద్రుల నియోజవర్గ ఉప ఎన్నికకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన నోటిఫికేషన్ జారీ చేయడంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 9వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 10వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు. ఈనెల 27వ తేదీన పట్టభద్రుల ఉప ఎన్నికకు ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. జూన్ 5వ తేదీన కౌంటింగ్ నిర్వహించి ఫలితాన్ని ప్రకటిస్తారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

- ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ
- తొలిరోజు నామినేషన్ దాఖలుచేసిన ముగ్గురు అభ్యర్థులు
- ఇప్పటివరకు ప్రాతినిధ్యం దక్కింది ఇద్దరికే
- కపిలవాయి, పల్లా చెరో రెండుసార్లు ప్రాతినిధ్యం
- ఈసారి కాంగ్రెస్ నుంచి రంగంలోకి తీన్మార్‌మల్లన్న
- బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థిత్వాలపై ఆసక్తి

పట్టభద్రుల స్థానానికి తొలిరోజు గురువారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్ కుమార్) శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నెల 9వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉండడంతో బీజేపీ, బీఆర్ఎస్‌పై అభ్యర్థుల ఎంపికకు ఒత్తిడి పెరిగింది. మొత్తం మూడు ఉమ్మడి జిల్లాల్లోని 12 జిల్లాల్లో 4,61,806 మంది పట్టభద్ర ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో పోటీకి ఆయా పార్టీల మద్దతు కోరుతూ పలువురు కీలక నేతలు ప్రయత్నాలు చేస్తుండడంతో అభ్యర్థిత్వం ఎవరికి దక్కుతుందనే అంశం ఆసక్తికరంగా మారింది.

నాలుగు పర్యాయాలు ఎన్నిక, ఇద్దరి ప్రాతినిధ్యం

ఉమ్మడి రాష్ట్రంలో 2007లో శాసనమండలి పునరుద్ధరణ జరిగాక వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల స్థానానికి నాలుగు పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. 2007లో మొదటిసారి జరిగిన ఎన్నికల్లో తెలంగాణవాదంతో కపిలవాయి దిలీప్‌కుమార్ మొదటిసారి విజయం సాధించారు. ఆతర్వాత 2009లోనూ ఆయనే మరోసారి గెలుపొందారు. ఆతర్వాత 2015లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచిన డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. తిరిగి 2021లోనూ ఆయనే గెలిచారు. అయితే 2021 ఎన్నికలో పోటీ తీవ్ర ఉత్కంఠభరితంగా కొనసాగింది. ఆ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న, తెలంగాణ జనసమితి అభ్యర్థిగా ప్రొఫెసర్ కోదండరామ్, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి రాములునాయక్, యువతెలంగాణపార్టీ నుంచి రాణి రుద్రమదేవి, సీపీఐ నుంచి జయసారధి రెడ్డి పోటీచేశారు. తీన్మార్‌మల్లన్న, ప్రొఫెసర్ కోదండరామ్ మొదటి ప్రాధాన్యం ఓట్లలో పల్లాకు పోటాపోటీగా ఓట్లు సాధించారు. ఉత్కంఠతో సాగిన ఈ ఎన్నికలో చివరికి రెండో ప్రాధాన్యం ఓట్లతో పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన జనగామ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది.

నామినేషన్ కౌంటర్ 1వ రోజు

పట్టభద్ర నియోజకవర్గం	2న దాఖలు	గతంలో దాఖలు	మొత్తం
నల్లగొండ	3	0	3



నల్లగొండలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందనకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న తెలంగాణ సకల జనుల పార్టీ అభ్యర్థి నందిపాటి జానయ్య

బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులెవరో?

మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో విస్తరించిన పట్టభద్ర నియోజకవర్గంలో ఈసారి కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న అభ్యర్థిత్వాన్ని ఇప్పటికే అధిష్ఠానం ప్రకటించింది. పోటాపోటీగా జరిగిన గత ఎన్నికల్లో ఆయన రెండో స్థానంలో ఉండగా, ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిత్వం దక్కడంతో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో సిట్టింగ్ స్థానం కావడంతో దీన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ సైతం బలమైన అభ్యర్థినే బరిలో దింపుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యేల్లో ఉత్సాహవంతులైన వారి పేర్లతో పాటు, వరంగల్ జిల్లాకు చెందిన కీలక నాయకుల పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తోంది. ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేస్తారని నాయకులు చెబుతున్నారు. బీజేపీ నుంచి గత ఎన్నికల్లో పోటీచేసిన ప్రేమేందర్‌రెడ్డినే కొనసాగిస్తారా? లేక ఈసారి నల్లగొండకు చెందిన సీనియర్ కు పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తారా? అనే అంశం తేలాల్సి ఉంది. పార్టీ ము ఖ్యులంతా లోక్‌సభ ప్రచారంలో ఉండడంతో దీనిపై దృష్టి పెట్టలేదని, ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థిని నిలబెట్టే అంశంపై చర్చిస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారు.

తొలిరోజు ముగ్గురు అభ్యర్థుల నామినేషన్

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నికకు తొలిరోజు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, ప్రజావాణి పార్టీ తరఫున పాటి శ్రీకాంత్‌రెడ్డి ఒక సెట్‌ను, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

గత ఎన్నికల్లో ప్రధాన అభ్యర్థులకు వచ్చిన మొదటి ప్రాధాన్య ఓట్లు ఇలా..

అభ్యర్థి	ఓట్లు
పల్లా రాజేశ్వర్‌రెడ్డి	1,11,190
తీన్మార్ మల్లన్న	83,629
కోదండరామ్	70,472
ప్రేమేందర్‌రెడ్డి	39,268
రాములునాయక్	27,713
జయసారధిరెడ్డి	8,732



భానుడి భగభగలు

ఉమ్మడి జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

వారం రోజులుగా ..

ఏప్రిల్ 26న	నిడమనూరు	45.2
27న	మాడ్గులపల్లి	45.2
28న	మాడ్గులపల్లి	45.4
29న	మాటూరు	45.5
30న	మాడ్గులపల్లి	46.2
మే 1	మునుగోడు	46.6
2	అనుముల	46.6



నల్లగొండలో కోళ్లపై నీళ్లు చల్లుతున్న చికెన్ సెంటర్ నిర్వాహకుడు


ఎండలతో మంట వ్యాధులతో తంటా

- వేడిమికి రోగాల ముప్పు
- అప్రమత్తంగా లేకపోతే ప్రాణానికే ప్రమాదం
- దోమల నుంచి డెంగీ, ఇతర విషజ్వరాలు
- వడదెబ్బతో విరేచనాలు, వాంతులు
- కోదాడ

వివరాలు 7లో..

- ఎండలు, వడగాడ్పులతో జనం విలవిల
- ఉమ్మడి జిల్లాలోని 45 ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ జారీ

నల్లగొండ, మే 2: ఉమ్మడి జిల్లాలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు తగ్గకుండా నమోదువుతున్నాయి. గురువారం నల్లగొండ జిల్లా జిల్లా అనుముల(హాలియా) మండలంలో 46.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండలకు తోడు వడగాడ్పులతో జనం విలవిలలాడుతున్నారు. పట్టణాల్లో ప్రధాన వీధులు దాదాపు నిర్మానుష్యంగా మారుతున్నాయి. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో జనం ఉక్కపోతను భరించలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 45 ప్రాంతాల్లో వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. నల్లగొండ జిల్లా నాంపల్లి 46.4, కేతేపల్లి, చందంపేట, చందంపేట, మాడ్గులపల్లి 46.2, త్రిపురారం, మునుగోడు, పెద్దవూర, నల్లగొండ, కట్టంగూరు 46.0డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యధికంగా 46.4, యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరులో 45.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



వడదెబ్బతో రైతు మృతి

ఈతకు వెళ్లి బాలుడి మృతి

- 7లో

ఎండ తీవ్రతకు సీసీ రోడ్డుకు పగుళ్లు



మిర్యాలగూడ పట్టణంలోని సీసీ రోడ్డుకు ఏర్పడ్డ పగుళ్లు

మిర్యాలగూడ, మే 2: వేసవిలో ఎండతీవ్రత తీవ్రంగా ఉన్నప్పుడు బండలు పగిలే ఎండలు అని సంబోధిస్తుంటాం. నిజంగా ఎండ వేడిమికి పగిలిన బండలను చూడటంఅరుదు. కానీ కొన్నిరోజులుగా బండలు పగిలే ఎండలు కాస్తున్నాయి. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని సీతారాంపురం కాలనీలో ఎండ వేడిమికి సీసీ రోడ్డు పగిలింది. స్థానిక రాజా మటన్ షాపు ఎదురుగా బంగారుగడ్డకు వెళ్లే మార్గంలోని సీసీ రోడ్డు 46 డిగ్రీల ఉష్ణోగ్రత తీవ్రతకు భళ్లున శబ్దంతో పేలింది. దీంతో రెండు అడుగుల మేర రోడ్డు పగిలి పెచ్చులు పైకి లేచాయి. మిట్టమధ్యాహ్నం కావడంతో జనసంచారం లేకపోవడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదనీ కాలనీవాసులు తెలిపారు.


పెద్దశబ్దం వచ్చింది : నాగలక్ష్మి, కూరగాయల వ్యాపారి



మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఎండ తీవ్రంగా ఉంది. కూరగాయల బండి నీడలో నేను కూర్చొని ఉన్నా. ఇంతలో ఎదురుగా పెద్ద శబ్దం అయింది. అటు చూస్తే సీసీ రోడ్డు పగిలిపోయి సిమెంట్ పెచ్చుల మధ్య నుంచి సన్నని ధూళి బయటకు వచ్చింది.

కమలంలో సమన్వయలోపం

- ప్రచారంలో కనిపించని సీనియర్లు
- సూర్యాపేటలో దూరంగా కీలకనేత



నల్లగొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ లోక్‌సభ స్థానంలో బీజేపీలో అభ్యర్థికి, సీనియర్ల మధ్య సమన్వయం కొరవడింది. దీంతో ప్రచారంలో ఆశించిన దూకుడు కనిపించడం లేదని పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అన్నిచోట్లా ఇదే పరిస్థితి ఉందని, దీంతో పార్టీ ఆశించిన ఫలితం రాదనే ఆందోళన క్యాడర్‌లో వ్యక్తమవుతోంది.

నల్లగొండ సీటుకు పోటీపడ్డ పలువురు సీనియర్లను కాదని, బీఆర్ఎస్ నుంచి వచ్చిన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డికి అధిష్ఠానం టికెట్ కేటాయించింది. సైదిరెడ్డికి టికెట్ ఇవ్వడాన్ని వ్యతిరేకించిన పలువురు పార్టీ సీనియర్ నాయకులు అధిష్ఠానం వద్ద అసంతృప్తిని వెళ్లగక్కారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లాలకు చెందిన పలువురు సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డికి టికెట్ ఇవ్వాలని కోరుతూ అధిష్ఠానంపై ఒత్తిడి కూడా తెచ్చారు. అయినా అందరినీ కలుపుకొని వెళ్లాలని సైదిరెడ్డికి సూచించిన అధిష్ఠాన ముఖ్యులు సీనియర్లకు నచ్చజెప్పారు. వారు సూచించిన మేరకు రెండు జిల్లాల్లో సీనియర్లను సమన్వయం చేసుకోకపోవడం వల్ల ప్రచారానికి చాలామంది దూరంగా ఉంటుంటే, మరికొందరు నామమాత్రంగా సమావేశాలకు హాజరవుతున్నారు.

ప్రచారానికి దూరంగా

నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి రాష్ట్ర, జాతీయ స్థాయి బాధ్యతల్లో ఉన్న పలువురు బీజేపీ ముఖ్యనాయకులు అభ్యర్థి ప్రచారంలో ఎక్కడా కనిపించడం లేదు. కొన్ని కీలకమైన సమావేశాలకు సైతం అభ్యర్థి రాకపోవడం ఏంటని కీలక నాయకులు ప్రశ్నిస్తున్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో పార్టీలో ఒక వర్గమే పెత్తనం చెలాయిస్తోందని నియోజకవర్గ కన్వీనర్ రతన్ సింగ్‌నాయక్ ఇప్పటికే ఆ బాధ్యతల నుంచి తప్పుకోగా, ఆయనకు నచ్చజెప్పడం గానీ, పార్టీలో క్రియాశీలకమయ్యేలా ఇతర నాయకులతో సమన్వయం చేసే ప్రయత్నం జరగకపోవడంపై గిరిజన నాయకులు గుర్రుగా ఉన్నారు. దేవరకొండ నియోజకవర్గంలోనూ సీనియర్లు లోక్‌సభ ఎన్నికల ప్రచార నిర్వహణపై కినుకవహించారు. సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, కనీసం గుర్తించనప్పుడు పార్టీకి పనిచేసినా ప్రయోజనం లేదనే ఆవేదనలో ఓ మహిళా నాయకురాలు, మరో సీనియర్ నేత సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పారాచూట్ లీడర్లకు టికెట్లిస్తే పార్టీకి ఉపయోగపడాలే తప్ప ఉన్న క్యాడర్ చెదిరిపోయే పరిస్థితి ఏర్పడితే ప్రయోజనమేంటని వారు ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం.

'పేట'లో కుదరని సఖ్యత

లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బీజేపీకి సంస్థాగతంగా, నాయకత్వపరంగా పట్టున్న సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపీ అభ్యర్థికి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న సంకినేని వెంకటేశ్వరరావుకు సఖ్యత లేని, దీంతో ఎంపీ అభ్యర్థి ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో కనీస ప్రచారం చేపట్టలేదని కార్యకర్తలు చెబుతున్నారు. ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బండి సంజయ్ బీజేపీ అధ్యక్షుడిగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని గుర్రంబోడు గిరిజనుల భూముల పరిరక్షణకు కార్యాచరణ చేపట్టినప్పుడు బీజేపీ కార్యకర్తలపై దాడులు, కేసులు పెట్టించారని, దీంతో సైదిరెడ్డిని బీజేపీలో చేర్చుకోవడాన్నే సంకినేని తీవ్రంగా వ్యతిరేకించారని చెబుతున్నారు. ఇప్పటికీ సూర్యాపేట నియోజకవర్గంలో ఎంపీ అభ్యర్థి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేకపోవడం ఇక్కడి పార్టీలో సమన్వయలోపాన్ని సూచిస్తోందని కార్యకర్తలు వాపోతున్నారు. పార్టీకి పట్టున్న నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఉంటే, ఇతర చోట్ల ఓట్లు ఎలా సాధిస్తారని ఆందోళన చెందుతున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనూ గుర్రంబోడు భూముల విషయంలో కేసులపాలైన బీజేపీ నాయకులు ఇప్పటికీ సైదిరెడ్డికి ఎంపీ టికెట్టివ్వడాన్ని ఆమోదించలేకపోవడంతో, ఇక్కడ కొత్త, పాత క్యాడర్ నడుమ విభేదాలు కన్పిస్తున్నాయి.

దేశంలో కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన



మోతెలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ రూరల్/ మోతె / హుజూర్‌నగర్, మే 2 : కాంగ్రెస్ పార్టీతోనే సుస్థిర పాలన సాధ్యమని, కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగొండ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి గురువారం కోదాడ, మోతెలలో నిర్వహించిన ప్రచార సభల్లో, హుజూర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్నిస్థానాల్లోనూ కాంగ్రెస్ గెలవడం ఖాయమన్నారు. మతతత్వ బీజేపీ ప్రభుత్వాన్ని అన్నివర్గాల ప్రజలు ఓటుతో గద్దె దించాలని కోరారు. దేశం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసిందన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎన్నికల్లో ఓడిపోయాక కేసీఆర్‌కు రైతులు, ప్రజా సమస్యలు గుర్తుకు వస్తున్నాయన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : రఘువీర్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి అన్నారు. దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి రానుందన్నారు. పార్టీ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. 10 రోజులు ఇంటింటా ప్రచారం నిర్వహించి, విజయానికి సైనికులుగా పనిచేయాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి ఎమ్మెల్యేలుగా, ఎంపీగా ఉన్నప్పుడే జిల్లాతో పాటు కోదాడ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరాలంటే రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. తాను ఇన్నాళ్లూ చేయలేని ప్రతీ పనిని రఘువీర్ చేసేలా చూస్తానాన్నరు. కోదాడ నియోజవర్గం నుంచే అత్యధిక మెజార్టీ వచ్చేలా నాయకులు, కార్యకర్తలు చూడాలని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు.

- కోదాడలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జానారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, నాయకులు, కార్యకర్తలు, సీపీఎం, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- మోతెలో జరిగిన సమావేశంలో నాయకులు ముత్తవరపు పాండురంగారావు, లక్ష్మీనారాయణరెడ్డి, పందిరి నాగిరెడ్డి, ఎంపీపీ ముప్పాని ఆశ, జడ్పీటీసీ పుల్లారావు, పుల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, మైనంపాటి గుర్వారెడ్డి, నూకల మధుసూదన్‌రెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఆంగోత్ నాగునాయక్, నాయకులు పాల్గొన్నారు.
- హుజూర్‌నగర్ సమావేశంలో తన్నీరు మల్లికార్జున్‌రావు, సాముల శివారెడ్డి, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, కుందూరు శ్రీనివాస్‌రెడ్డి, సింగారపు సైదులు, కర్నాటి వీరనాగిరెడ్డి దొంతగాని శ్రీనివాస్, గోపిరెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌పై ప్రచార నిషేధం కుట్రలో భాగమే



సూర్యాపేటలో ప్రచారంలో భాగంగా ఓట్లను అభ్యర్థిస్తున్న మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్, మే 2 : ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి కలిసిన చేసిన కుట్రలో భాగంగానే బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ప్రచారాన్ని 48 గంటల పాటు నిలిపివేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంట కండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. గురువారం జిల్లాకేంద్రంలోని 20వ వార్డులో ప్రచారం నిర్వహించి అనం తరం విలేకరుల సమావేశంలో మా ట్లాడారు. మోదీ, రేవంత్ విద్వేష ప్రసంగాలు, ఫేక్‌వీడియోలు ఈసీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ సిరిసిల్ల బస్సుయాత్రలోని మాటలను వక్రీకరించారన్నారు. కేసీఆర్ బస్సుయాత్రతో మోదీకి, రేవంత్‌రెడ్డికి వణుకు మొదలైందన్నారు. అరు యాత్రలతోనే ఇద్దరి కాళ్ల కింద భూమి కంపిస్తోందన్నారు. కేసీఆర్ ప్రజాప్రభంజనం చూసి తట్టుకోలేక చిల్లర ప్రయత్నం చేశారని విమర్శించారు. వీధిరౌడీలా మాట్లాడిన రేవంత్‌రెడ్డి స్వేచ్ఛగా తిరుగుతుంటే కేసీఆర్‌ని మాత్రం ఇంటికి పరిమితంచేయడం దారుణమన్నారు. రేవంత్ అవినీతి తెలిసినా కేంద్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. కేసీఆర్‌ను అడ్డుకోవడంతో ప్రచారానికి మించి రెట్టింపు ప్రజామద్దతు వస్తుందన్నారు. ఎన్ని నిషేధాలు పెట్టినా 16 సీట్లు రాష్ట్రంలో తామే గెలుపొందుతామన్నారు. కేసీఆర్‌కు మద్దతుగా నేతన్నలు కదిలి వస్తున్నారని తెలిపారు.కేసీఆర్‌ను ప్రచారం చేయకుండా ఆపడం వల్ల బీఆర్ఎస్‌కు ఓట్ల శాతం పెరుగుతుందన్నారు. చిన్న కరువుకే నీరు ఇవ్వలేని చేతకాని ప్రభుత్వమన్నారు. బీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండుస్థానాల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. ఆయన వెంట మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మతకాల చలపతిరావు పాల్గొన్నారు.

తనిఖీలు వేగవంతం చేయాలి : కలెక్టర్



సూర్యాపేట అర్బన్, మే 2 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని చెక్‌పోస్టుల్లో తనిఖీలు మరింత ముమ్మరం చేయాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకర్లు బ్యాంక్ లావాదేవీలతో పాటు డిజిటల్ లావాదేవీలు రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు జరిగే వాటిపై పర్యవేక్షించాలన్నారు. పోస్టల్ శాఖ ద్వారా జరిగే లావాదేవీలపై గట్టి నిఘా పెంచాలన్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీంలు నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద స్వాధీనం చేసుకున్న వాటికి రశీదులు ఇవ్వాలని తెలిపారు. నగదు, బంగారం, వస్తువులకు సంబంధించి వివరాలను రశీదుల్లో పేర్కొనాలని సూచించారు. లిక్కర్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. జిల్లాలో 32 బృందాలు విధుల్లో ఉన్నారని జిల్లా అంతటా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున ప్రజలు సహకరించాలన్నారు.

ఎన్నికల నిర్వహణలో రూట్ మొబైల్ విధులు ప్రధానం: ఎస్పీ

సూర్యాపేట అర్బన్, మే 2: ఎన్నికల నిర్వహణలో రూట్ మొబైల్ విధులు ప్రధానమైనవని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రూట్ మొబైల్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులపై నిశిత పరిశీలన చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందితో, పోలీస్ అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికల అనంతరం స్ట్రాంగ్ రూంలకు తరలించడం కూడా రూట్‌మొబైల్ సిబ్బందికి ముఖ్యమన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్‌మీనా, డీఎస్పీలు రవి, మట్టయ్య, స్పెష్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, సీఐలు రాజశేఖర్, శ్రీను, రఘువీర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎస్ఐలు, జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తి అసెంబ్లీల పరిధిలోని రూట్ మొబైల్ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

గంజాయిని విక్రయిస్తున్న ఐదుగురి అరెస్టు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ టౌన్, మే 2 : గంజాయి మత్తుకు అలవాటు ఐదుగురు తాము సేవించడమే కాకుండా తెలిసిన వారికి విక్రయించడం మొదలుపెట్టారు. ఇదే క్రమంలో తెచ్చుకున్న గంజాయిని వాటాలుగా చేసి పంచుకుంటుండగా పోలీసులకు పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలను నల్లగొండలోని పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ శివరాంరెడ్డి గురువారం విలేకరులకు వివరించారు. యాదాద్రిభువగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామానికి చెందిన తెడ్ల సాయికుమార్, నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన తాటిపాముల పవన్, షేక్ జావిద్, చింతకుంట్ల గణేష్, అమ్మనబోలు గ్రామానికి చెందిన బోడ వినోద్‌కుమార్‌లు వివిధ వృత్తుల్లో ఉన్నప్పటికీ పక్కపక్క ఊరి వారు కావడంతో స్నేహితులయ్యారు. వీరికి గంజాయి అలవాటు ఉండటంతో వేర్వేరు ప్రాంతాల్లో గంజాయిని కొనుగోలు చేసి సేవిస్తుండేవారు. ఇదే క్రమంలో వీరంతా సులభంగా డబ్బులు సంపాదించాలనుకుని తమ కోసం కొనుగోలు చేసిన గంజాయిలో కొంత విక్రయించడం మొదలుపెట్టారు. నార్కట్‌పల్లి మండల పరిధితో పాటు నల్లగొండ సమీపంలోని ఎంజీయూ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులకు విక్రయించేవారు. ఇలా అక్రమమార్గంలో డబ్బుల సంపాదనకు అలవాటు పడిన వారు 20రోజుల క్రితం సమావేశమై అతి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి తమ అవసరాలతో పాటు ఎక్కువ మొత్తాన్ని సంపాదించేందుకు నిర్ణయించారు. ఇందుకోసం షేక్‌జావిద్ తనకు పరిచయం ఉన్న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం గ్రామానికి చెందిన కిరణ్, ఆశిష్‌లతో ఫోన్‌లో సంప్రదించగా సరుకు ఇచ్చేందుకు వారు అంగీకరించడంతో ఐదుగురు కలిసి ఒక్కొక్కరు రూ.8వేల చొప్పున రూ.40 వేలు జమచేసుకున్నారు. ఆ డబ్బుతో తెడ్ల సాయికుమార్, తాటిపాముల పవన్‌లు శ్రీకాకుళం వెళ్లి గంజాయి కొనుగోలు చేసి నార్కట్‌పల్లికి తెచ్చారు. ఆ గంజాయిని ఐదుగురు కొన్నిరోజుల పాటు సేవించారు. వారు సేవించగా మిగిలిన రూ.31 విలువైన 1.250 కిలోల గంజాయిని తెలిసిన వారికి విక్రయించేందుకు అక్కెనపల్లి శివారులో సమావేశమయ్యారు. ఐదుగురు సమానంగా పంచుకొని ఐదు ప్యాకెట్లుగా తయారుచేసుకొని తీసుకుంటుండగా విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి గంజాయితో పాటు ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ కేసులో అరెస్టు అయిన తెడ్ల సాయికుమార్‌పై గతంలో నార్కట్‌పల్లి, చైతన్యపూరి, మోత్కూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు ఉన్నాయి. ఈ కేసులో గంజాయి విక్రయించిన శ్రీకాకుళంకు చెందిన కిరణ్, ఆశిష్‌లు పరారీలో ఉన్నారని, అదేవిధంగా గంజాయిని కొనుగోలు చేసి సేవించిన వారిని విచారిస్తున్నామని డీఎస్పీ శివరాం రెడ్డి తెలిపారు. సమావేశంలో నార్కట్‌పల్లి సీఐ కే నాగరాజు, ఎస్ఐలు అంతిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడి మృతి



నాగరాజు మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 2(ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు. నల్లగొండ జిల్లా సూరారం గ్రామానికి చెందిన బండమీది నాగరాజు(29) కుటుంబం రెండేళ్ల నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామంలో నివాసం ఉంటోంది. నాగరాజుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. గీత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. కాగా గురువారం ఉదయం గ్రామ శివారులోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో తాటి ముంజలు దించేందుకు తాటిచెట్టు ఎక్కాడు. చెట్టుపై నుంచి ముంజలు దించుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తల వెనుకభాగంలో బలమైన గాయాలు కావడంతో వెంటనే హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి స్థానికులు తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. నాగరాజు సోదరుడు మహేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రోక్తంగా నిత్య తిరుల్యాణోత్సవాలు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, మే 2: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు పాంచరాత్రాగమనరీతిలో గురువారం వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి విశ్వక్సేనుడి తొలి పూజలతో కల్యాణతంతు నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో సాంప్రదాయరీతిలో నిత్య పూజలు వైభవంగా జరిగాయి. అదేవిధంగా అనుబంధ శివాలయంలో పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్ర హవనం, శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 28,87,191ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

నాలుగు కేంద్రాలకు వచ్చిన లారీలు

● మోత్కూరు మార్కెట్లో హమాలీల కొరత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మోత్కూరు, మే 2: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రంతో పాటు మండలంలోని బుజిలాపురం, పొడిచేడు, దత్తప్ప గూడెం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ గురువారం ఒక్కో లారీ చొప్పున పంపారు. కొనుగోలు కేంద్రాలకు లారీలు రాక తూకం వేసిన బస్తాలు మిల్లులకు ఎగుమతి కాక రైతులు పడుతున్న కష్టాలను 'లారీలు రావు... బస్తాలు ఎత్తరు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ ఒక్కో గ్రామానికి ఒక్కో లారీ పంపించారని సింగిల్‌విండో సీఈవో కె. వరలక్ష్మి తెలిపారు. బుజిలాపురం, పొడిచేడు, దత్తప్పగూడెం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలను లారీల్లోకి ఎత్తగా, మోత్కూరు మార్కెట్‌కు ఈ రోజు హమాలీలు తక్కువగా వచ్చినందున లారీకి బస్తాలు ఎత్తలేదని తెలిపారు. ఇలానే ప్రతిరోజూ కొనుగోలు కేంద్రాలకు లారీలు పంపేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆమె కోరారు.

బ్రాహ్మణపల్లిలో నాలుగు ఇళ్లలో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

గుండాల, మే2: యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని బ్రాహ్మణపల్లిలో బుధవారం అర్ధరాత్రి నాలుగు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పి. వీరేశం ఇంటి తాళాన్ని రాడ్డుతో పగులగొట్టిన దొంగలు మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారు. అన్నోజు సత్తయ్య ఇంటి తాళం పగులగొట్టి ఏడు తులాల పట్టగొలుసులు, రూ.2వేల నగదు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా చెవిటి సోమక్క ఇంటి తాళం పగులగొట్టి రూ.6వేల నగదు, అప్పు పత్రాలు తీసుకెళ్లారు. గొంగళ్ల చంద్రమ్మ ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఏమీ లేకపోవడంతో వెళ్లి పోయారు. ఒకే గ్రామంలో ఒకే రోజు నాలుగు ఇళ్లలో దొంగతనాలు జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. చోరీ జరిగిన ఇళ్లనుఎస్ఐ యాకన్న గురువారం పరిశీలించారు. ఆధారాలు సేకరించేందుకు క్లూస్ టీంను రప్పించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ లీకై మంటలు.. కాలిన వస్తువులు

గరిడేపల్లి, మే 2: గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చేలరేగాయి. దీంతో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని రేగులగడ్డతండాలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండా గ్రామానికి చెందిన గుగులోతు శ్రీను భార్య మంత్రి రాత్రి 8 గంటల సమయంలో వంట చేసేందుకు గ్యాస్ పొయ్యి ముట్టించగానే సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇల్లు మొత్తం వ్యాపించి ఇల్లు దగ్ధమైంది. ఇంట్లో దాచిపెట్టిన రూ.లక్ష నగదు, ధాన్యం, దుస్తులు, ఇంట్లో ఉన్న సామగ్రి కాలి బూడిదయ్యాయి. అప్రమత్తమైన గ్రామస్థులు సిలిండర్‌ను బయటికి తీసుకొచ్చి మంటలు ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంటల దాటికి ఇల్లు కూడా పగుళ్లు వచ్చినట్లు తెలిపారు.

హైకోర్టులో మాజీ ఎమ్మెల్యే భగత్ రిట్ పిటిషన్

● ఈఈ-19 క్వార్టర్ సీల్ తొలగించాలని ఎన్నెస్పీ అధికారులకు ఆదేశాలు

నాగార్జునసాగర్, మే 2: నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ సాగర్ హిల్‌కాలనీలో గతంలో నివాసమున్న ఈఈ-19 క్వార్టర్‌ను నెల 2వ తేదీన రెవెన్యూ అధికారులు, పోలీసుల సాయంతో ఎన్నెస్పీ అధికారులు క్వార్టర్‌లో ఉన్న సామాన్లను ఎన్ఎస్పీ సర్కిల్ కార్యాలయానికి తరలించి క్వార్టర్‌కు సీల్ వేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యే హైకోర్టును ఆశ్రయించారు. ఆ క్వార్టర్‌కు వేసిన సీల్‌ను 48గంటల్లో తొలగించాలని హైకోర్టు ఎన్నెస్పీ అధికారులకు గురువారం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ చేపట్టే వరకు ఆ క్వార్టర్‌కు సీల్ వేయకూడదని కూడా అధికారులను కోర్టు ఆదేశించింది.


చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

అనంతగిరి, మే 2: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని తమ్మర గ్రామంలో జరిగింది. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చింతకాయల వీరయ్య(28) మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని రోజూ తల్లిదండ్రులతో ఘర్షణ పడుతుండేవాడు. ఈ క్రమంలో గత నెల 27వ తేదీన మద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో తమ్మర చెరువు వద్ద పురుగుల మందు తాగి పడిపోయాడు. ఈ విషయం గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న తల్లి చింతకాయల మహాలక్ష్మమ్మ వెంటనే కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. వీరయ్య తల్లి మహాలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బత్తాయి తోట దగ్ధం

పెద్దఅడిశర్లపల్లి, మే 2: నిప్పంటుకుని బత్తాయి తోట దగ్ధమైంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గుడిపల్లి మండలం చిలకమర్రి గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం చిలకమర్రి గ్రామానికి చెందిన మావిళ్ల పద్మకు చెందిన బత్తాయి తోట పక్కన కంచెలో నిప్పు పడి మంటలు వ్యాపించి పక్కనున్న బత్తాయి చెట్లకు అంటుకున్నాయి. 50బత్తాయి చెట్లు పూర్తిగా, 30చెట్లు పాక్షికంగా కాలిపోయాయి. వీటితో పాటు తోటలో పరిచిన డ్రిప్పు పైపులు కాలిపోయాయి. ఆరు సంవత్సరాల నుంచి లక్షల రూపాయలు వెచ్చించి కాపాడుకుంటున్న చెట్లు కాలిపోవడంతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. ఆరుగాలం పడ్డ కష్టం అంతా బూడిదపాలైయిందని బాధిత ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాణం తీసిన ఈత సరదా



మణికంఠ(ఫైల్)

సూర్యాపేటరూరల్, మే 2: ఈత సరదా బాలుడి ప్రాణం తీసింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని పిన్నాయిపాలెం గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పబ్బు సతీష్, రేణుక దంపతుల కుమారుడు మణికంఠ(7) ఈత నేర్చుకుంటానని తాతను తీసుకుని గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. వాటర్ క్యాన్ నడుముకు కట్టి బావిలో ఈత కొడుతున్న క్రమంలో క్యాన్ ఊడిపోవడంతో మణికంఠ బావిలో మునిగిపోయాడు. గమనించిన తాత బాలుడిని ఒడ్డుకు తీసుకొచ్చి సపర్యలు చేశాడు. అప్పటికే బాలుడు మృతిచెందాడు. మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి బాలుడి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, చిరుమర్తి లింగయ్య ఉన్నారు.

రూ.15.14లక్షల నగదు స్వాధీనం

భువనగిరి టౌన్, వలిగొండ, మే 2: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో యాదాద్రిభువనగిరి జిల్లాలో నిర్వహిస్తున్న వాహన తనిఖీలలో పోలీసులు గురువారం రూ.15.14లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే 28.06 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని 19మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ ఎం రాజేష్‌చంద్ర హెచ్చరించారు. గురువారం జిల్లాలో రూ.13,48,661 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా వలిగొండ మండలంలోని పుల్లిగిల్ల గ్రామానికి చెందిన కొమ్మిడి వెంకట్‌రెడ్డి బైక్‌పై రూ.1,66,000 తరలిస్తుండగా మండలకేంద్రంలోని తొర్రూరు క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేనందున సీజ్ చేసి జిల్లా డీటీవో కార్యాలయంలో డిపాజిట్ చేసినట్లు తెలిపారు.

తిప్పర్తి: కిరాణం దుకాణంలో అక్రమంగా విక్రయిస్తున్న 11లీటర్ల మద్యాన్ని నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని కేశరాజుపల్లి గ్రామానికి చెందిన మోదాల సైదులు తన కిరాణం దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా తిప్పర్తి పోలీసులు దాడిచేసి 12, బీర్లు, 12 క్వాటర్‌లు, 18 (90ఎంఎల్) సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వడదెబ్బతో రైతు మృతి



జాన్‌రెడ్డి(ఫైల్)

తిప్పర్తి, మే 2: వడదెబ్బతో రైతు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం తిప్పలమ్మగూడెం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన తోట జాన్‌రెడ్డి (60) బుధవారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరిగి 10గంటల సమయంలో ఇంటికి వచ్చి సొమ్మసిల్లి పడిపోయాడు. ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో గురువారం సాయంత్రం తన నివాసంలో మృతిచెందాడు.


ఎండలతో మంట వ్యాధులతో తంటా

● పెరుగుతున్న భానుడి భగభగలు ● వేసవిలో నీరు, ఆహారం, దోమలతో జాగ్రత్త అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన



భానుడి ప్రతాపంతో ఎండలు మండుతున్నాయి. ఏప్రిల్ నెలలోనే 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతతో అల్లాడిన జనం, మే నెలలో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎండలలో అప్రమత్తంగా లేకుంటే ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వేసవిలో సాయంత్రం ఎంత హాయిగా ఉంటుందో.. బాధలు కూడా అంతే ఉంటాయని చెబుతున్నారు. మధ్యాహ్నం ఉక్కపోత.. రాత్రి దోమల మోత.. వీటితో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా వ్యాధులు తప్పవంటున్నారు. వేసవిలో చల్లదనం కోసం తీసుకునే నీరు, పండ్ల రసాల పట్ల అప్రమత్తంగా ఉంటే సగం వ్యాధులకు దూరం కావచ్చునంటున్నారు. ఆరు బయట పడుకుంటే దోమల బెడదనుంచి తప్పించుకునేందుకు దోమ తెరలను రక్షణ వలయంగా మార్చుకుంటే మలేరియా, డెంగీ వ్యాధులకు దూరంగా ఉంచవచ్చిని చెబుతున్నారు. బయటకు వెళ్తున్నపుడు గొడుగులు, టోపీలు మరవ వద్దని సూచిస్తున్నారు. సన్‌స్క్రీన్ లోషన్ వాడటంద్వారా ఎండనుంచి చర్మాన్ని రక్షించుకోవచ్చునని సూచిస్తున్నారు. (కోదాడ)

దోమలు తెచ్చే ముప్పు



డెంగీ: వేసవిలో వాతావరణంలో వచ్చే మార్పులతో దోమల సంతతి పెరుగుతుంది. దీంతో అవి తీసుకొచ్చే వ్యాధుల బెడద కూడా ఎక్కువే. శుభ్రమైన నీటిలో పెరిగే ఈడిస్ ఈజీప్టు రకం దోమ ద్వారా డెంగీ జ్వరాలు విజృంభిస్తాయి. వేసవిలో ఇళ్లలో వాడే కూలర్లలో, మూతలేని నీళ్ల ట్యాంకుల్లో, పూల కుండీల్లో, పాతటైర్లు, కొబ్బరి చిప్పల వంటివాటిల్లో ఈదోమలు పెరుగుతాయి. ఫలితంగా జ్వరం ఒకేసారి వణుకుతో మొదలై 101నుంచి 104డిగ్రీల వరకు రావచ్చు. తీవ్రమైన తలనొప్పి, ఒళ్ళునొప్పులు, కండరాలు, కీళ్ల నొప్పులు వస్తాయి. ఇతరత్రా లక్షణాలు లేకుండా తీవ్రంగా జ్వరం వచ్చిందంటే అది డెంగీయే అని అనుమానించి వైద్యులను సంప్రదించాలి.

మలేరియా: దోమలతో మరో సమస్య మలేరియా. ఆడఅనాఫిలస్ దోమ ద్వారా వ్యాపించే ప్లాస్మోడియం పరాన్న జీవి దీనికి కారణం. హఠాత్తుగా విపరీతమైన చలి, వణుకు, ఆవెంటనే జ్వరం రావటం మలేరియా లక్షణం అంటున్నారు వైద్యులు. వెంటనే వైద్యులను సంప్రదించాలి.

చికున్‌గున్యా: ఈడిస్ ఈజిప్ట దోమద్వారా వ్యాపించేదే చికున్‌గున్యా. చికున్ గున్యా వైరస్ ఉన్న వాళ్లను కుట్టిన దోమ మరొకరని కుట్టటం ద్వారా ఇతరులకు సంక్రమిస్తుంది. దీని బారిపడినవారు జ్వరం, ఒళ్లునొప్పులు, కీళ్లనొప్పులు తీవ్రంగా ఉంటాయి. వైద్యులను సంప్రదించాలంటున్నారు.

నీరు, పండ్ల రసాలతో వచ్చే వ్యాధులు

విరేచనాలు: ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఎక్కడపడితే అక్కడ వేసవిలో నీరు, పండ్ల రసాలు, తాగుతుంటారు. దీంతో నీళ్ల విరేచనాలు సహజం అంటున్నారు. నీళ్ల విరేచనాలతో ఒంట్లో నీరు తగ్గిపోవచ్చు(డీహైడ్రేషన్). ఇది చాలా ప్రమాదకరం. ఒంట్లో నీరు తగ్గకుండా మజ్జిగ, కొబ్బరినీరు, ఓఆర్ఎస్‌లాంటి ఎక్కువగా తీసుకోవడం మంచిది.

టైఫాయిడ్: మురుగునీరు కలుషితమయ్యే ప్రాంతాల్లో దీన్ని ముప్పు ఎక్కువ. టైఫాయిడ్ జ్వరాలకు మూలం సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా. ఈబ్యాక్టీరియా ఉన్న వ్యక్తిమలంతో కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా టైఫాయిడ్ ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుంది. కొద్దిగా మొదలై జ్వరం రోజరోజుకు పెరుగుతూ తీవ్రస్థాయికి చేరుకోవట మే దీని లక్షణం. వాంతులు, ఆకలిలేకపోవడం, కడుపునొప్పి, ఒళ్లునొప్పులు, నీరసం ఉంటుంది. సరైన చికిత్స తీసుకోకుంటే వారాల కొద్దీ జ్వరం విడవకుండా వేధిస్తుంది. టైఫాయిడ్ రాకుండా టీకా అందుబాటులోకి వచ్చింది.

కామెర్లు: వేసవిలో నీరు, ఆహారం కలుషితం కావడంతో కామెర్లు కూడా విజృంభిస్తుంటాయి. హెపటైటిస్ ఏ, ఇ వైరస్‌లు మూలం. కామెర్లతో ఆకలిమందగించటం, కొద్దిపాటి జ్వరం, మూత్రం పచ్చగా రావటం, కళ్లు,చర్మం పచ్చగా మారటం లక్షణాలు ఉంటాయి. కామెర్లను అశ్రద్ధ చేయరాదు. వైద్యులను సంప్రదించాలి లేదంటే ప్రాణానికే ప్రమాదం.

ఎండతో వచ్చే ఇబ్బందులు



ఎండదెబ్బ: విపరీతమైన ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల మూలంగా వేసవిలో ఎదురయ్యే ప్రధాన సమస్యలు ఎండదెబ్బ, వడదెబ్బ. రెండింటిలో వడదెబ్బ మరింత ప్రమాదకరమైందంటున్నారు వైద్యులు. ఎండదెబ్బ తగిలినప్పుడు విపరీతంగా చెమటపోసి, ఒంట్లోంచి లవణాలు ఎక్కువగా బయటకు పోతాయి. దీంతో తీవ్ర నీరసం, కండరాల నొప్పి, తలనొప్పి, స్థిమితంలేకపోవడం వంటివి మొదలైవుతాయి. ఇలాంటి పరిస్థితిలో వ్యక్తిని వెంటనే చల్లటి ప్రదేశానికి తరలించాలి. చెమటద్వారా కోల్పోయిన లవణాల భర్తీకి ప్రతి 10నిమిషాలకూ కొద్దిగా ఉప్పు కలిపిన నీరు, పళ్లరసం తాగించాలి.

వడదెబ్బ: ఎండ తీవ్రతకు మన శరీరంలో ఉష్ణోగ్రతను నియంత్రించే యంత్రాగం అస్తవ్యస్తమై వడదెబ్బ తగలొచ్చు. మంటల జ్వరం, ఒళ్లు వేడెక్కిపోతుంటుంది. కానీ చెమట పోయదు. విపరీతమైన దప్పిక, మగత, తలతిప్పు, నాడి వేగంగా కొట్టుకోవడం, స్పృహతప్పటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇటువంటి వారికి గాలి విసరాలి, తడిగుడ్డతో ఒళ్లంతా తుడుస్తుండాలి. వెంటనే వైద్యుల వద్దకు తీసుకువెళ్లాలి.

మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు: వేసవిలో తగినంత నీరు తాగకపోతే మూత్రనాళ ఇన్‌ఫెక్షన్‌కు దారితీసే అకాశం ఉందంటున్నారు వైద్యులు. ఈ సమస్య పురుషులు కంటే మహిళలకు ఎక్కువగా ఉంటుంది. వేసవిలో దహం వేసేంత వరకూ ఆగకుండా మధ్యమధ్యలో రోజంతా తరుచు నీళ్లు తాగుతుండటం ఉత్తమంటున్నారు వైద్యులు. లేదంటే మూత్ర సమస్యలు రావచ్చునంటున్నారు.

ముక్కు నుంచి రక్తం: ఎండ వేడికి ముక్కులు పొరబారి రక్తనాళాలు చిట్లే ప్రమాదముంది. దీంతో ఎండకాలంలో చాలామంది పిల్లలకు ముక్కు నుంచ రక్తం కారుతుంటుంది. ఇలాంటప్పుడు తల ముందుకు వచ్చి ముక్కును వేలితో పది నిమిషాలపాటు సున్నితంగా నొక్కిపట్టి ఉంచితే రక్తం గడ్డకట్టి కారటం ఆగిపోతుందని వైద్యులు సూచిస్తున్నారు. అదేవిధంగా వేసవిలో మన చర్మం మీద స్వేద రంధ్రాలు మూసుకుపోవటం వలన వేసవిలో మెడ, భుజాలు, ఛాతీ వంటి ప్రదేశాలలో ఎర్రగా సన్నటి చెమట పొక్కులు వస్తాయి. ఇటువంటి పరిస్థితిలో చెమట పట్టకుండా డస్టింగ్ పౌడర్ వంటివి అద్దుకోవటం ద్వారా చెమట పొక్కుల రాకుండా నివారించకోవచ్చునని సూచిస్తున్నారు.

వైరస్‌లతో వచ్చే జబ్బులు



ఆటలమ్మ: ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పులతో వేసవిలో ఆటలమ్మ(చికెన్‌పాక్స్) విస్తరిస్తుంది. దీనికి సెల్లా జోస్టర్ అనే వైరస్‌మూలం. దీని బారినపడిన వారు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు గాలిలో వ్యాపించే తుంపర్ల ద్వారా ఈవైరస్ ఇతరులకు సోకుతుంది. ఆటలమ్మ సాధారణంగా పిల్లలో ఎక్కువ అంటు న్నారు వైద్యులు. దీనితో చర్మంపై అక్కడక్కడా సన్నటి, ఎర్రటి పొక్కులు బయలుదేరతాయి. క్రమేపీ అవి ఒళ్లంతా వ్యాపిస్తాయి. ఈసమయంలో బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండి, విశ్రాంతి తీసుకోవాలి. పదిరోజులలో తగ్గిపోతుంది. ఒకసారి ఆటలమ్మ వచ్చినవారికి తిరిగి జీవితంలో మళ్లీ ఎప్పుడూ రాదు, ఆటలమ్మ రాకుండా టీకా అందుబాటులో ఉంది.

కళ్ల కలకల: వేసవిలో ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పుల కారణంగా చాలా రకాల వైరస్‌లు విజృంభిస్తాయి. కళ్లకలక కూడా ఇలా వైరస్‌ల కారణంగా విస్తరించే సమస్యేనంటున్నారు వైద్యులు. ముఖ్యంగా వేసవి ఆరంభంలో ఈసమస్య చాలా ఎక్కువ. కళ్లు ఎర్రబడటం, కళ్ల నొప్పి, దురద, వెలుగు చూడలేకపోవటం, రెప్పలపై పుసులు కట్టటం వంటి లక్షణాలు కనబడతాయి. కలక వచ్చినవారు కళ్లను రుద్దకుండా, కళ్లను శుభ్రమైన నీటితో కడుక్కుని, పొడిగుడ్డతో అద్దుకోవచ్చు. దీంతో రెండుమూడు రోజులలో దానంతట అదే తగ్గిపోతుందని వైద్యులు పేర్కొంటున్నారు. అదేవిధంగా గవదబిళ్లలు కూడా వేసవిలో ఒకరిలనుంచి మరొకరికి వ్యాపించి వేధిస్తూ ఉంటాయి. వేసవిలో వ్యాధుల, ఎండల పట్ల అప్రమత్తంగా ఉంటే తమను తాము రక్షించుకోవచ్చునని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

చౌటుప్పల్ రూరల్ ఏప్రిల్ 2: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లక్కారం జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం నెమలికాలువ గ్రామానికి చెందిన కొండ మల్లేష్(48) బుల్లెట్ వాహనంపై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రగాయలకు గురైన మల్లేష్‌ను హైదరాబాద్ కామినేని అసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మల్లేష్ కుమారుడు ప్రదీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మద్దిరాల: ట్రాక్టర్ పల్టీ కొట్టి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలోని గోరెంట్ల గ్రామ శివారులో జరిగింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తొర్రూరు మండలం చీకటాయపాలెం గ్రామానికి చెందిన కొండ సందీప్ (24) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 1వ తేదీన ట్రాక్టర్‌లో వరి ధాన్యం తీసుకొని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు తరలించి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో మద్దిరాల మండల పరిదిలోని గోరెంట్ల గ్రామ శివారులో జాతీయ రహదారి 365పై ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ భాగం సందీప్‌పై పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సందీప్ భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. సందీప్ భార్య కొండ శిరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భువనగిరి టౌన్: యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయగిరికి చెందిన ఆర్ఎంపీ వైద్యులు గుమ్మడి రాజు(55) మృతిచెందాడు. మోటార్ బైక్‌పై భువనగిరి నుంచి రాయగిరికి వెళ్తూ పాలశీలతీకరణ కేంద్రం సమీపంలో ముందు వెళ్తున్న బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టాడు. భువనగిరి జిల్లా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. ఇతని భార్య, ఓ కుమారుడు కరోనాలో మృతిచెందగా మరో కుమారుడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వలిగొండ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన మధు తన సొంత పనిపై మండలంలోని నెమలి కాల్వ గ్రామానికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు నాగారం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కల్లు అమ్మివస్తానని చెప్పి వెళ్లి..



గోపి (ఫైల్)

గుర్రంపోడు, మే 2: అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని శాకాజీపురం గ్రామంలో గురువారం జరిగింది. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. శాకాజీపురం గ్రామానికి చెందిన ఉడుతల గోపి(30) గీత కార్మికుడిగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం కల్లు అమ్మి వస్తానని చెప్పి తన బైక్‌పై ఇంటి నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం గ్రామానికి చెందిన పేర్ల రామచంద్రారెడ్డి అనే రైతు వ్యవసాయ భూమి వద్ద నెమలి చెట్టుకు టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని గోపి భార్య పావని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో మరొకరు..

తిప్పర్తి: నల్లగొండ తిప్పర్తి మండల పరిధిలోని ఇండ్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్డెరగూడెంలో గురువారం అనుమానాస్పస్థితిలో వ్యక్తి మృతిచెం దాడు. తెలిపిన వివరాల ప్రకారం పల్లపు లింగయ్య(38) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం భార్యతో పాటు బంధువుల ఇంటికి వెళ్లి అదే రాత్రి ఇంటికి వచ్చారు. గురువారం తెల్లవారుజామున తన ఇంట్లో ఉరి వేసుకొని మృతిచెందాడు. సాయంత్రం అంత్యక్రియలు చేయడానికి ప్రయత్నం చేస్తుండగా బంధువులు 100కు డయల్ చేసి లింగయ్య మృతిపై తమకు అనుమానం ఉందని అభ్యంతరం తెలిపారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. లింగయ్యకు భార్య, కుమారుడు ఉన్నారు.

ఆన్‌లైన్ మోసం.. రూ.1.04లక్షలు మాయం

భువనగిరి రూరల్, మే 2: యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం అనాజీపురం గ్రామానికి చెందిన ఉసికె వెంకట్‌రెడ్డి ఆన్‌లైన్ మోసానికి గురై రూ.1.04లక్షలు పోగొట్టుకున్నాడు. భువనగిరి రూరల్ ఎస్ఐ వి. సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్‌రెడ్డి మొబైల్ ఫోన్‌కు గుర్తుతెలియని వ్యక్తులు క్రెడిట్ కార్డు వస్తుందని కెనరా బ్యాంక్ క్రెడిట్ కార్డు లింక్ పంపగా అతను ఓపెన్ చేశాడు. అతనికి 8144160090 నెంబర్ నుంచి ఫోన్ చేసి వాట్సాప్‌లో ఉన్న క్రెడిట్ కార్డు లింక్ ఓపెన్ చేయమని చెప్పడంతో లింక్ ఓపెన్ చేయగానే అతని బ్యాంక్ అకౌంట్ నుంచి వరుసగా రూ.44వేలు, రూ.50వేలు, రూ.10వేలు చొప్పున నగదు కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో వెంకట్‌రెడ్డి భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు వస్తే వాటిని ఓపెన్ చేయవద్దని చేసి బ్యాంకు వివరాలు అడిగితే చెప్పవద్దని ఎస్ఐ సూచించారు. వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

చోరీకి గురైన సొమ్ము ఇప్పించాలని నిరసన



ధర్నా చేస్తున్న బాధితుడు

చండూరు రూరల్, మే 2: మద్యం మత్తులో ఉన్న తన వద్ద నుంచి డబ్బులు చోరీ చేశారని, తన సొమ్ము ఇప్పించాలని ఓ వ్యక్తి నిరసనకు దిగాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చండూరు మండలంలోని శిర్దెపల్లి గ్రామంలో గురువారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆడెపు నరసింహ వృత్తి రీత్యా పశువుల వ్యాపారి. గత శనివారం సంతలో పశువుల బేరం కోసం రూ.30వేలు తీసుకుని వెళ్లగా బేరం కాకపోవడంతో గ్రామానికి తిరిగి వచ్చాడు. తన స్నేహితుడైన పల్లె నర్సింహతో బేరం విషయం చర్చించుకుంటూ మద్యం తాగాలని నిర్ణయించుకుని గ్రామ శివారులోని పల్లె నర్సింహ్మ వ్యవసాయ భూమిలో మద్యం తాగి అక్కడే నిద్రించారు. ఆ సమయంలో ఆడెపు నర్సింహ దగ్గర ఖర్చులు పోను రూ.27 వేల నగదు ఉన్నాయని, ఇద్దరిలో పల్లె నర్సింహ తెల్లవారే సరికి లేకపోవడంతో తన దగ్గర ఉన్న డబ్బులు కన్పించకపోవడంతో తనే తీశాడని ఆరోపించాడు. ఊర్లోకి వెళ్లి అడగగా తనకు తెలియదని బుకాయిస్తున్నాడని, గ్రామ పెద్దలు పిలిచినా స్పందించక పోవడంతో సోమవారం రోజున స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, మూడు రోజులు గడుస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితుడు ఆరోపించాడు.

మట్టి మాఫియాపై చర్యలేవీ?

● తిప్పర్తి సోమరాజు చెరువులో మట్టి తవ్వకాలు ● రోడ్లు, వెంచర్లకు తరలిస్తున్నవైనం ● నిబంధనలకు విరుద్ధంగా పెద్ద గుంతలు ● పట్టించుకోని అధికారులు



చెరువులో నుంచి ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలిస్తున్న దృశ్యం



చెరువు మట్టిని ప్లాట్‌లలో నింపుకున్న స్థానికులు

తిప్పర్తి, మే 2 : మట్టి మాఫియా అండతో చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలించి రోడ్లు, వెంచర్లకు వాడుతున్నారు. అంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. రైతుల పేరుతో ఒండ్రు మట్టి పేరు చెప్పి పెద్దఎత్తున చెరువు మట్టిని తరలిస్తున్నారు వేసవిలో మండల వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో నీరు ఇంకిపోయింది. దీంతో పలు రంగాల్లో ఉన్న వ్యాపారులు చెరువుల్లో మట్టి తరలించే పనిలో మునిగారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువు మట్టిని నిర్దేశించిన లోతుకు మించకుండా అనుమతి తీసుకొని పంట పొలాలకు మాత్రమే తరలించాలి. కానీ తిప్పర్తిలోని సోమరాజు చెరువులో మాత్రం ఇష్టానుసారం పెద్ద పెద్ద గుంతలు పెట్టి పైన ఉన్న ఒండ్రు మట్టిని తరలించడంతో పాటు దాని కింద ఉన్న మొరం కూడా అక్రమంగా తరలిస్తూ మట్టి రోడ్లు, ఇళ్ల ప్లాట్లు, ఇటుక బట్టీలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్నారు. చెరువులో పెద్ద గుంతలు ఎలా పెడతారని పలువురు రైతులు ప్రశ్నించగా తమకు అనుమతి ఉందని, అనుమతి తీసుకున్నాకే మట్టి తరలిస్తున్నామని ట్రాక్టర్, జేసీబీ యజమానులు సమాధానమిస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. చెరువులో 10 ఫీట్లకు పైగా గుంతలు పెట్టి మట్టిని తీయడం ద్వారా చెరువులో నీళ్లు ఉన్న సమయంలో పశువులు, వాటి కాపరులు ప్రమాదవశాత్తు పడి మృతి చెందే అవకాశం ఉంటుంది. సుమారు 114ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సోమరాజు చెరువు సుమారు 50ఎకరాల పైగా కబ్జాకు గురైనట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

చెరువు శిఖంలో కూడా

ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువు శిఖంలో పట్టా పొందిన రైతులు చెరువులో నీరు లేకుండా ఉండి సాగుకు అనుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే సాగు చేసుకోవాల్సి ఉంది. కానీ శిఖం భూమిలో కూడా ఇష్టానుసారంగా పెద్ద ఎత్తున మట్టి పోసి వారి పొలాన్ని ఎత్తుగా ఉండే విధంగా చేస్తున్నారు. దీంతో చెరువు విస్తీర్ణం తగ్గడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం తగ్గి రైతులకు ఎక్కువ నీరు నిల్వ లేకుండా పోయే ప్రమాదముందని రైతులు పేర్కొంటున్నారు.

15 రోజులుగా జరుగుతున్నా..



చెరువుల్లో మట్టి తరలించే క్రమంలో ముందస్తుగా ఇరిగేషన్ శాఖ అధికారుల ద్వారా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాగా అధికారులకు ముందస్తుగా ఒక్కో జేసీబీ లెక్కన మామూళ్లు అప్పజెప్పడం వల్లనే 15రోజులుగా మట్టి తరలిస్తున్నా అధికారులు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి మట్టి మాఫియాను అడ్డుకొని చెరువులను కాపాడాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు

మట్టి తరలింపునకు సంబంధించి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. చెరువు మట్టిని అక్రమంగా తరలించిన వారిని గుర్తించే పనిలో ఉన్నాం. వాహనాలు, తరలించిన మట్టి ఆధారంగా గుర్తించి చర్యలు తీసుకుంటాం. ఈ విషయమై పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాం.

● శివరామ్, ఇరిగేషన్ ఏఈఈ, తిప్పర్తి.

'ఉపాధి' కూలీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

● 'ఉపాధి' స్టేట్ విజిలెన్స్ అధికారి ఉష ● ఎండల తీవ్రతపై పలు ప్రాంతాల్లో అధికారుల అవగాహన



పక్షుల కోసం మఠంపల్లి మండలం చౌటపల్లి ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన నీటి బుట్టలు

తుంగతుర్తి, మద్దిరాల, కోదాడ రూరల్, తిరుమలగిరి, మఠంపల్లి, మే 2: 'ఉపాధి' కూలీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని 'ఉపాధి' స్టేట్ విజిలెన్స్ అధికారి ఉష అన్నారు. గురువారం తుంగతుర్తి మండలంలోని కొత్తగూడెం గ్రామంలో, మద్దిరాల మండలంలోని గోరెంట్ల, పోలుమళ్ల గ్రామాల్లో నిర్వహిస్తున్న 'ఉపాధి' పనులను పరిశీలించి మాట్లాడారు. కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ తాగునీరుఅందిస్తున్నారా? టెంట్లు వేసి నీడ వసతి కల్పిస్తున్నారా? అన్ని అడిగి తెలుసుకున్నారు. కూలీలు పని చేసే ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని, నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయం ఆరు గంటలకే పనికి వచ్చి, 11గంటలకు ఇంటికి వెళ్లాలని సూచించారు. ప్రతి కుటుంబానికి 100రోజుల పని రోజులు కల్పిస్తామని, కూలీలు కొలతల ప్రకారం రోజుకు రూ.300వేతనం పొందాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ సునీత, తుంగతుర్తి, మద్దిరాల ఎంపీడీవోలు శేషగిరిరావు, సత్యనారాయణరెడ్డి, 'ఉపాధి' ఏపీవోలు కృష్ణ, గుండు వెంకన్న, ఈసీ చారి, టీఏ మురళి, నాగరాజు, గ్రామ కార్యదర్శులు మహేష్, మంగ పాల్గొన్నారు.

ఎండలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో

ఎండలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో జరుగుతున్న వివిధ జాతీయ కార్యక్రమాలపై ఆరోగ్య సిబ్బందితో, వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ప్రతిఒక్కరూ ఎండలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

●కోదాడ మండలంలోని యర్రవరం గ్రామంలో ఉన పశు వైద్య కేంద్రాన్ని జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పశుపోషణ, పశు యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

అవసరమైతేనే ప్రజలు బయటికి రావాలి

ఎండల తీవ్రత పెరిగినందున ప్రజలు అవసరమైతేనే ఇళ్ల నుంచి బయ టికి రావాలని తిరుమలగిరి తహసీల్దార్ సుధ, ఎంపీడీవో లాజర్ సూచిం చారు. ఎండల తీవ్రతపై గురువారం తిరుమలగిరి ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో 'ఉపాధి' పనులు తొందరగా ముగించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు, కూలీలకు మంచినీరు, ఓఆర్ ఎస్, ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే కాంటాలు చేయాలన్నారు. మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమీషనర్ రామదుర్గారెడ్డి, ఎస్సై సత్యనారాయణ, ఎంపీవో మారయ్య పాల్గొన్నారు.

మూగ జీవాలను కాపాడుకోవాలి

ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున మూగ జీవాలను కాపాడుకునేందుకు ప్రత్యేక పద్ధతులు పాటించా లని మఠంపల్లి మండల పశు వైద్యాధికారి శంకర్ కట్టా సూచించారు. మఠంపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఉదయం 10గంటల లోపు, సాయంత్రం ఐదు గంటల తరువాత జీవాలను మేతకు పంపాలని, గ్రామాల్లోని నీటి తొట్టెలను నీటితో నింపాలన్నారు. పక్షులు, పిచ్చుకల కోసం చెట్ల మొదలు, కొమ్మల మధ్య నీటి బుట్టలు, షెడ్లు ఏర్పాటు చేయాలని, నీటి తొట్టెలతో పాట పశువులను, జీవాలను కొట్టాలు, నీడనిచ్చే చెట్ల కింద కట్టేయాలని, మేత, పరిశుభ్రమైన నీరు అందేలా చూడాలని తెలిపారు. పక్షుల నీటి కోసం చౌటపల్లి గ్రామంలోని ప్రధాన రహదారిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. అవసరమైతే పశువైద్యాధికారి సెల్ నెం.96031.82532ను సంప్రదించాలన్నారు.



తుంగతుర్తి మండలం కొత్తగూడెం గ్రామంలో 'ఉపాధి' కూలీలతో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి ఉష

వడదెబ్బ తగలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి

వడదెబ్బ తగలకుండా ప్రజలకు ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి సుధాకర్‌నాయక్ ఆదేశించారు. మఠంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలు అత్యవసర పరిస్థితుల్లోనే బయటికి రావాలని, బయటకు రావద్దని, ఓఆర్ఎస్ ద్రావణంతో పాటు నీరు తాగాలన్నారు. వడదెబ్బకు గురైన వారికి ప్రథమ చికిత్స చేసే విధానంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అదేశించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రవి కుమార్, నాగేంద్రమ్మ, లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నీరు వృథా.. జనం వ్యథ



చెన్నాయిపాలెం వద్ద లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ నీరు

మండు వేసవిలో నీరు లేక జనం ఇబ్బందులు పడుతుంటే మఠంపల్లి మండలంలోని చెన్నాయిపాలెంలో మిషన్ భగీరథ పైపు లైన్ లీకై నీరు వృథా అవుతోంది. మట్టపల్లి కృష్ణానది నుంచి వర్ధాపురం, చెన్నాయిపాలెం మీదుగా అలింగాపురం వరకు వేసిన మిషన్ భగీరథ పైపులైను చెన్నాయిపాలెం వద్ద పైపు నాలుగు రోజుల క్రితం లీకై నీరంతా వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ మండల అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

● మఠంపల్లి

బాలిక బాధ్యత నాదే: పద్మావతి

కోదాడ రూరల్, మే 2: ఇటీవల కోదాడ సమీపంలోని శ్రీరంగాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన లావణ్య బాధ్యతను తానే తీసుకుంటానని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని చిమిర్యాల గ్రామంలో లావణ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రమాదంలో మొత్తం ఆరుగురు మృతిచెందగా, వారిలో లావణ్య తండ్రి శ్రీకాంత్, చెల్లెలు లాస్య కూడా ఉన్నారు. తల్లి నాగమణి, లావణ్య ప్రాణాలతో బయటపడ్డారు. వారిని ఎమ్మెల్యే పరామర్శించి లావణ్య బాధ్యతను తానే తీసుకుంటానని, ఆ కుటుంబాన్ని పార్టీ పరంగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొత్తా గురవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రేపూరి వెంకటాచారి, కొండా పూర్ణ పాల్గొన్నారు.

రైతులకు, హమాలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత

నూతన్‌కల్, మే 2: మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు, హమాలీలకు ఆశాకార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్త సునంద మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున హమాలీలు, రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పన్నాల మల్లారెడ్డి, వెంకన్న, శ్రీరాములు, హమాలీలు పాల్గొన్నారు.

గుంజలూరులో కనిపించని ఎన్నికల కోడ్



గుంజలూరులో పార్టీల గద్దెలకు, శిలాఫలకాలకు ముసుగువేయని అధికారులు

చివ్వెంల మండ లంలోని గుంజలూరు గ్రామంలో ఎన్నికల కోడ్ కనిపించడం లేదు. గ్రామంలో మెయిన్ రోడ్డు పక్కన, ప్రధాన చౌరస్తాలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ గద్దెలతో పాటు పక్కనే ఉన్న మరో శిలాఫలకానికి అధికారులు ముసుగు వేయలేదు. గ్రామంలో ఎన్నికల కోడ్ నిబంధనలను అమలుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

● చివ్వెంల

జగదీశ్‌రెడ్డి అక్రమాలను బయటకు తీస్తాం



సూర్యాపేటలో మాట్లాడుతున్న మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్, చివ్వెంల, మే 2: గత పదేళ్ల పాలనలో మాజీ మంత్రి జగదీశ్‌రెడి చేసిన అక్రమాలు, భూకబ్జాలను త్వరలోనే బయటకు తీస్తామని మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డిని విమర్శించే స్థాయి, అర్హత జగదీశ్‌రెడ్డికి లేదన్నారు.. ప్రజాదర్బార్‌లో బీఆర్ఎస్ నాయకులు చేసిన భూకబ్జా దరఖాస్తులే అధికంగా వస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ భూములను రియల్టర్ల అప్పగించి, కమీషన్లకు కక్కుర్తిపడి నూతన కలెక్టరేట్‌ను నిర్మించారని ఆరోపించారు. సూర్యాపేటలో జరిగిన అవినీతిపై కమిటీ వేసి నిజాలను వెలికితీస్తామన్నారు. ఔట్ సోర్సింగ్‌లో అవతవకలు జరిగాయని, సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో ఒకే గ్రామానికి చెందిన 60మందిని ఉద్యోగులుగా నియమించారని, దీనిపై కూడా విచారణ జరిపిస్తామన్నారు. మంత్రిగా జగదీశ్‌రెడ్డి పోలీస్ వ్యవస్థను పూర్తిగా తన సొంతానికే వినియోగించుకుని కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారన్నారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రిగా జగదీశ్‌రెడ్డి పనిచేసి సూర్యాపేటకు కనీసం మహిళా డిగ్రీ, జూనియర్ కళాశాలలు తీసుకరాలేని అసమర్థుడని విమర్శించారు. నియోజకవర్గంలో జగదీశ్‌రెడ్డి చేసిన అభివృద్ధిపై, తాను చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. బీఆర్ఎస్ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించి, స్వేచ్ఛగా, స్వతంత్రంగా బాధలు చెప్పుకునే అవకాశం వచ్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి సూర్యాపేట నియోజకవర్గంలో 40వేలకు పైగా మెజార్టీ వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, చకిలం రాజేశ్వరరావు, అంజద్‌అలీ, కక్కిరేణి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

తండాలను అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌దే

తండాలను అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. చివ్వెంల మండలంలోని మంగళితండాలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో, బొడ్రాయికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, కాంగ్రెస్‌కు ఓటేస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కొప్పుల వేణారెడ్డి, మాజీ జడ్పీటీసీ చింతమల్ల రమేష్, ఎంపీటీసీ వేములపల్లి వాసుదేవరావు, వెన్న మధూకర్‌రెడ్డి, జంపాల అంజయ్య. గోగుల ఈదయ్య. వెంకన్న, వీరబోయిన మహేష్ పాల్గొన్నారు.

అనుమతులు లేని ఆసుపత్రులను సీజ్ చేస్తాం



కోదాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రి నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కోట చలం

కోదాడటౌన్, కోదాడ రూరల్, మే 2: అనుమతులు లేకుండా ఆసుపత్రులను నిర్వహిస్తే సీజ్ చేస్తామని డీఎంహెచ్‌వో కోటచలం హెచ్చరిం చారు. గురువారం కోదాడలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్యులు తమ అర్హతలను, రిజిస్ట్రేషన్ నెంబర్లను విధిగా ప్రదర్శించాలని, తప్పుడు ధ్రువ పత్రాలు, అర్హత పత్రాలు అందజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు వ్యాధులను నిర్ధారించి, ప్రభుత్వ వెబ్‌సైట్లో ఆన్లైన్ చేయాలని, దీనికి సంబంధించి ఇటీవల శిక్షణ ఇచ్చామన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలని, సాధారణ కాన్పుల కోసం ప్రత్యేక శిక్షణ తీసుకున్న సిబ్బంది పూర్తిస్థాయిలో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఓ ఆసుపత్రిని సీజ్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్, పోగ్రాం అధికారులు, వ్యాధి నిరోధక టీకాల అధికారి పెండెం వెంకటరమణ, జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి కల్యాణ్‌చక్రవర్తి, మాతా,శిశు సంరక్షణ అధికారి జయ, సంక్రమిత వ్యాధుల అధికారి నజియా, డాక్టర్ వెంకటరమణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ దశరథనాయక్, అంజయ్య, కిరణ్, సతీష్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వరప్రసాద్‌రెడ్డి

కోదాడ రూరల్, నూతనకల్, హుజూర్‌నగర్, మే 2: పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి విజయానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అల్వాలపురం, దోరకుంట, చిమిర్యాల, మంగలితండా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల కంటే భారీ మెజార్టీ తీసుకువచ్చేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశాల్లో ఎంపీపీ మల్లెల రాణి బ్రహ్మయ్య. జడ్పీటీసీ కృష్ణకుమారి, వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, సీతారాం రెడ్డి, అమరనాయిని వెంకటేశ్వరరావు, పాలకి సురేష్, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, కొత్తా గురవయ్య, కొండా పూర్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేసింది ఏమీలేదు '

రాష్ట్రాభివృద్ధికి బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేసింది ఏమీలేదని యువజన కాంగ్రెస్ నూతనకల్ మండల అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ అన్నారు. గురువారం నూతనకల్ మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కేంద్రంలో కూడా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. సమావేశంలో క్రాంతి, మహేష్, సికిందర్, రాజు, శ్రీను, సాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే మాదిగల మద్దతు: చింతా బాబు

పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మాదిగలు మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతా బాబుమాదిగ తెలిపారు. హుజూర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య ఆదేశాల మేరకు నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. మాదిగలకు న్యాయం చేసింది ఒక్క కాంగ్రెస్ పార్టీయే అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.లక్ష్మణ్, రణపంగు రాము, కాటమయ్య, ముక్కంటి, విజయభాస్కర్, మహేష్, రవి, నాగరాజు, సుధాకర్, జీవరత్నం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'బీజేపీ విజయానికి కృషి చేయాలి'

చిలుకూరు, మే 2: నల్లగొండ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి విజయానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి యాదా రమేష్ కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువు మట్టిని అక్రమంగా తవ్వుతున్నారని ఫిర్యాదు

చిలుకూరు, మే 2: మండల కేంద్రంలోని ఊరచెరువులో మట్టిని కొందరు అక్రమంగా తవ్వుతున్నారని చిలుకూరు గ్రామస్థులు కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ ధ్రువకుమార్, ఇరిగేషన్ అధికారి మానసకు గురువారం ఫిర్యాదు చేశారు. మట్టి కోసం చెరువులో ఇష్టానుసారంగా గుంతలు తవ్వడంతో ప్రమాదకరంగా మారుతున్నాయని, అక్రమ తవ్వకాలను ఆపాలని కోరారు.

కాంగ్రెస్ మహిళా కార్యకర్త మృతి

పెన్‌పహాడ్, మే 2: మండలంలోని నాగులపాటిఅన్నారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ముత్తినేని పిచ్చమ్మ(58)అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. పిచ్చమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పిచ్చమ్మ మృతదేహానికి భుజంగరావు, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ నివాళులర్పించారు.

'ఆర్ఎంపీలు, టీఎంపీలపై దాడులను అరికట్టాలి'

నడిగూడెం, మే 2: ఆర్ఎంపీలు, టీఎంపీలపై జరుగుతున్న దాడులను నివారించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు కోరారు. నడిగూడెంలో జరిగిన కాంగ్రెస్ సభలో ఎమ్మెల్యే పద్మావతి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. గ్రామీణ వైద్యులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకా లను అందించాలని కోరారు. కార్యక్రమంలో సైదులు, దున్నా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బొజ్జగూడెంతండాలో కార్డన్‌సెర్చ్

అనంతగిరి, మే 2: మండలంలోని బొజ్జగూడెంతండా గ్రామంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో లైసెన్సులు లేని వాహనాలను, ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత నేరస్థులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఐదుగురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

అర్వపల్లి, మే 2: మండలంలోని తిమ్మాపురం, అడివెంల గ్రామాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి శ్రీధర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత ఉంటే, వెంటనే తెలియజేయాలన్నారు. ఎండలకు రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో సత్యం, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన

నేరేడుచర్ల, మఠంపల్లి, మే 2: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మేడారం, పెంచికల్‌దిన్న, దిర్శించర్ల, నేరేడుచర్ల, దాచారం, చింతకుంట్ల పాఠశాలలకు చెందిన విద్యార్థులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అభినందించి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణ రెడ్డి, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ బట్టు మధు, లయన్స్ క్లబ్ సభ్యులు రాచకొండ శ్రీనివాస్, తోట శ్రీనివాస్, బాణావత్ సైదులు, కుక్కడపు సైదులు, గుండా సత్యనారాయణ, రామస్వామి, సుంకరి క్రాంతికుమార్, యూసుఫ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

●పదో తరగతి ఫలితాల్లో 10/10జీపీఏ సాధించి మండల టాపర్లగా నిలిచిన మఠంపల్లి మండల కేంద్రంలోని నాగార్జున సిమెంట్స్ లిమి టెడ్(ఎన్‌సీఎల్) విద్యార్థినులు జి.శ్రీహిత, ఎ.సాయి సుష్మను అభినం దించి సన్మానించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రెసిడెంట్ ఎస్.చక్రధర్, జీఎం హెచ్‌ఆర్ సతీష్‌కుమార్, డాక్టర్ శ్రీహరిరావు, పాఠశాల ప్రిన్సిపాల్ పూర్ణచందర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి

తిరుమలగిరి రూరల్, మే 2: భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలపించాలని ఆ పార్టీ మండల కన్వీనర్ జి.ఉప్పలయ్య కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని జలాల్‌పురం, కోట్యానాయక్‌తండ, రాజ్యానాయక్‌తండ, మామిడాల గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం 35ఏళ్లుగా శ్రమిస్తున్న జహంగీర్‌ను గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ప్రచారంలో ఆవుల సోమయ్య, రమేష్, నాగరాజు, భిక్షమాచారి పాల్గొన్నారు.

సీపీఐలో చేరిన బీఆర్ఎస్ నేత కొట్టు బాబు



కొట్టు బాబుకు కండువా కప్పి సీపీఐలోకి ఆహ్వానిస్తున్న చంద్రశేఖర్

హుజూర్‌నగర్ రూరల్, మే 2: పట్టణానికి చెందిన రైతు సంఘం నాయకుడు, బీఆర్ఎస్ నేత కొట్టు బాబు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సీపీఐలో గురువారం చేరారు. సుదీర్ఘ కాలం సీపీఐ రైతు సంఘంలో పనిచేసిన కొట్టు బాబు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాతృ పార్టీ సీపీఐలో చేరగా ఆయనకు గన్నా చంద్రశేఖర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గన్నా చంద్రశేఖర్ మాట్లాడుతూ సీపీఐని బలోపేతం చేయడంలో కొట్టు బాబు క్రియాశీలకంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ, గుండు వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి, జడ శ్రీనివాస్, ఉమ, పద్మ, రమేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

హుజూర్‌నగర్ రూరల్, మే 2: మండలంలోని పెదవీడు గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్‌రహీం కుమారుడు ఈతకు వెళ్లి మృతి చెందగా, లక్కవరం గ్రామానికి చెందిన అబ్దుల్‌రహీం ఏడో తరగతి క్లాస్‌మేట్స్ ఆ కుటుంబాన్ని గురువారం పరామర్శించి, రూ.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఉపేందర్, నాగరాజు, మధు, గురవయ్య, బాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

హుజూర్‌నగర్, మఠంపల్లి, మే 2: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని వ్యాయామ ఉపాధ్యాయుడు బ్రహ్మారెడ్డి, హెచ్‌ఎం పెనుగొండ శ్రీనివాస్ కోరారు. గురువారం మండలంలోని లింగగిరి గ్రామంలో వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి, ఆరోగ్యానికి దోహపడతాయన్నారు. విద్యార్థులు, యువత ఈ వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగసైదులు, ప్రదీప్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

● జిల్లా యువజన సర్వీసెస్, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మఠంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు మన్నెం సీతారాంరెడ్డి కోరారు. గురువారం మఠంపల్లిలో ఆయన మాట్లాడుతూ 14సంవత్సరాల లోపు ఉన్న బాలబాలికలు, అర్హత ఉన్న విద్యార్థులకు ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు శిక్షణను నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటర్లు ప్రలోభాలకు లొంగొద్దు

ఆత్మకూర్(ఎస్), మే 2: ఓటర్లు ప్రలోభాలకులొంగొద్దని జైభారత్ ఉద్యమ సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు గుండు వెంకన్న అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని నెమ్మికల్ గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. పోటీ చేసే అభ్యర్థుల నైతిక ప్రవర్తన, అర్హత, నిబద్ధత, సమర్థత తదితర అంశాలను పరిశీలించి ఓటు వేయాలన్నారు. ప్రజాస్వామ్య విలువలు, ఓటు ప్రాధాన్యంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోనగిరి లింగయ్య, దండ వెంకటరెడ్డి, బెల్లంకొండ చక్రయ్య, సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో మేడే ఉత్సవాలు

ఆత్మకూర్ (ఎస్), మే 2: మండలంలోని ముక్కుడుదేవులపల్లి, గట్టికల్, గ్రామాల్లో సీపీఎం, సీపీఐ(ఎంఎల్)ఆధ్వర్యంలో గురువారం మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఏపూరు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఎర్ర జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో మీరే అప్పయ్య, వీరప్రసాద్ రెడ్డి, గుండు లింగయ్య, రాచకొండ సైదులు, రమేష్, భానుప్రసాద్, ఎల్లుట్ల ఉపేందర్, లింగన్న, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రచారం రేపు

కోదాడ టౌన్, మే 2: నల్లగొండ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నియోజకవర్గంలో ఈ నెల నాలుగో తేదీన నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి కటికం సత్తయ్యగౌడ్‌లు తెలిపారు. గురువారం కోదాడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన కోదాడ పట్టణ, మండల ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించే రోడ్డు షోను విజయవంతం చేయాలని కోరారు. అమలు చేయలేని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని అన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతు పలకాలని వారు కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.